రక్షాసూత్ర బంధనము

శ్రీమతి తటవర్తి సత్యవతీదేవిగారు

సాయంకాల సమయము. దినమందు రవి తన తీవ్రాతపముచే ప్రపంచమును దపింపజేసి పశ్చిమాంగనాసక్తుడై యరుగుచుండెను. చిత్తూరు రాజోద్యానవనమం దిరువురు స్త్రీలు సంభాషించుచుండిరి. అందొక్కతె ప్రౌఢ. ఒకతె ప్రౌఢావస్థకు జేరుచుండెను. ఆ పడంతుక లిద్దరి మోములందును విచారము అధీరత్వము ప్రకటమగుచుండెను. మొదటి స్త్రీ వ్యగ్రతా పూర్ణస్వరముతో పలికెను.

"సోదరీ! మన కందర కిప్పు డుపాయమేమి ఆలోచించితివి?

"కొంచెముగూడ స్థిరీకరింపజాలను. భగవానుడగు ఏకలింగస్వామి యుద్దేశ్య మెట్లున్నదో."

ఈసారి బహదూర్ షా ఉదయపురమును పూర్తిగా మట్టిలో కనిపివేయవలెనని నిశ్చయించినట్లును అట్లే ప్రతిజ్ఞచేసియున్నట్లును వినవచ్చినది."

"సర్దారులందరు విక్రమజిత్తుయెడ నసంతుష్టులై యుండుటవలన వారందరు విక్రమజిత్తునకు సాయము చేయుదురనిన సందేహాస్పదముగా దోచుచున్నది. వారందరు విక్రమజిత్ యెడ నింత క్రోధులైయుండుటకుగల హేతువెద్దియో నాకు తోచకున్నది. అటులున్నను అందరుకూడ మేము పప్పాబాయి రాజ్యమందు వాసము చేయుచున్నామని యనుచున్నారు."

"సర్దారులందరు విక్రమజిత్తునకు సాయముచేసినను చేయకున్నను చిత్తూరును రక్షించుటలో వెనుతిరుగరు. మరి విక్రమజిత్తు రాజ్యము అత్యాచారిణియగు పప్పాబాయి రాజ్యమైపోయెనా?"

"ఎవరెరుగుదురు? వారందరిట్లే పలుకుచున్నారు. ఏ సమయములో పప్పాబాయి ఏమి చేసియున్నదో కాని యామెతో విక్రముని సరిపోల్చుచున్నారు. కాని సేనాపతులు విక్రమునిపై జేయు క్రోధముజూడ చిత్తూరును రక్షించుటకుకూడ వారు రారనియు పూనుకొనరనియు తోచుచున్నది."

"సోదరీ! నీవు వట్టి అమాయకురాలవు గదా! మేవాడ్ దేశవాసులకు చిత్తూరెంత గౌరవవస్తువో నీ వెరుగనట్లు తోచుచున్నది. చిత్తూరు వారికి ప్రాణములకంటె ప్రియమైనది. చిత్తూరు రాణాయందు వారికి సంపూర్ణమగు అయిష్టత గలిగియున్నప్పటికి మనస్ఫూర్తిగ వారు చిత్తూరును పూజచేయుదురు."

"ఇట్లున్ననుగూడ గుజరాత్ పాదుషాతో నెదురొడ్డిన సమర్థుడగువాడు చిత్తూరులో నెవడు గలడు?"

"సోదరీ! ఇట్లు నీ వేల పలుకుదువు? ఈ మేవాడు దేశము ప్రస్తుతము స్మశానమువలెనున్నను సమయము వచ్చినచో ఈ భస్మరాశియందునుండి అగ్ని ప్రజ్వలించును.

"సోదరీ! ఇట్లు కాగలదేమో కాని నాకుమాత్రము నమ్మకము లేకుండుటచే నే నేదియు స్థిరము చేయజాలకుంటిని."

"నీ వింత భయపడిపోయితివా ఛీ! సోదరీ! ఈలాగున పలికి నా మనస్సుకు బాధ కలిగింపకుము. రాజపుత్రస్త్రీలు మరణమన్న భయపడుదురా?"

"అట్లైన నీ వింత ఆలోచించెద వెందుకు? ఏకలింగభగవానుని యుద్దేశ్య మెట్లో అట్లే కాగలదు."

"నేను నాకొరకు విచారించుచుంటి ననుకొంటివా? విక్రముని విషయమై, ఉదయుని విషయమై ఆలోచించుకొన నాకు చాల భయము కలుగుచున్నది."

"అవును. నీ ఆలోచన బాగున్నది. కుమారులిద్దరి విషయమై బెంగగా ఉన్నది. అయినను రాజపుత్ర డింభకులుగూడ తమ విషయములో తా మాలోచించుకొనకుండ ఉండజాలరు. వారు బాల్యావస్థనుండియు సాముగరిడీలయందు నేర్పరులేగదా."

"అది సరియే. కాని ఒక్కసారిగ ఏకలిప్తలో బప్పారావుల వంశమును నీవు లుప్తము చేయదలంచుచుంటివా?"

"నీ వన్నది సత్యము. ఈ సంగతి నాకు ధ్యానమే లేదు. మనమందఱ మెట్టి చిక్కులలో తగుల్కొన్నను సరే బప్పారావుల వంశము నిర్మూలము కాకుండ మనము జాగ్రత్త పెట్టవలయును."

"చిత్తూరుకోట రక్షితము కానిదే ఈ బాలకులెట్లు అపాయరహితులగుదురు? విక్రముడు వీరుడే కాని అతడు గుజరాత్ సుల్తాను సైన్యముల నెట్లెదుర్కొనగల్గును?"

"ఈమాట సరియే కాని అందుల కెట్టి యుపాయమాలోచించిన మన కార్యము నెరవేరును?"

"సోదరీ! ఒక ఉపాయము చేసిన మన కార్యము నెరవేఱజాలదా?

"ఎట్టి ఉపాయము?"

"హుమాయూను బాదుషాను చిత్తూరును రక్షింపవలసినదిగా ప్రార్థించినచో మన పని సఫలము కాదా?"

ఈ సంగతి విని రెండవస్త్రీ బిగ్గరగ నవ్వెను. మరల మొదటిస్త్రీ పలికెను. "సోదరీ! ఒక్కసారియే నవ్వులో నెగురగొట్టితివేమి?"

"నీమాట వినిన యెవరికి నవ్వురాదు? ఎవని తండ్రి స్వర్గవాసియగు చిత్తూరు రాణాకు ప్రతిద్వంద్వియో అట్టివానిని చిత్తూరునకు వచ్చిన ఆపత్తు తొలగించి కాపాడవలసినదిగా ప్రార్థించుట వెర్రితనము గాదా?"

"సోదరీ! నామాట యొక్కసారిగ అట్లు కొట్టివేయకుము. బాబరు స్వర్గీయులగు రాణావారికి శత్రువులైనను రాజపుత్రుల శౌర్యపరాక్రమములను ప్రశంసించుటలో తృప్తికనువాడు. హుమాయూను బాదుషాకూడ మనల ప్రశంసించుచు ఉండవచ్చును."

"ముసల్మానుల ప్రశంసపై నీవు విశ్వాస ముంచుచుంటివా?"

"మొగలులు అట్టి ముసల్మానులు కారని నేను వినియుంటిని. వారికి హిందువులయెడ సద్భావము గలదు?"

"నీవీ ఆశ్చర్యకరమైనసంగతి యెచ్చటవింటివి?"

"కాదు. ఇదిఅంతయు సత్యము. మొగలులు చాల శాంతప్రకృతి గలవారు. హిందువులతో సఖ్యము చేయుటకై వారెప్పుడును తలచుచుందురు. చిత్తూరు రాణి అనురోధమును ఆతడెన్నడు తిరస్కరింపజాలడు."

"నీవెట్లు అనురోధము చేయుదువు?"

"నేను బాదుషావద్దకు రక్షాసూత్రము పంపెదను. ఏపవిత్ర రక్షాసూత్ర బంధనముచే రాజపుత్ర స్త్రీలు రాజపుత్రుల సోదరులని పిలుతురో అట్టి బంధనముతోడనే మొగల్ పాదుషాను స్నేహమునకై ప్రార్థించెదను."

"ఏది యెట్లున్నను నీ సాహసము అత్యద్భుతము. కాని మొగలులు రాజపుత్రస్త్రీయొక్క రక్షాసూత్ర బంధనము స్వీకరింతురా?"

"తప్పక స్వీకరించెదరని నాకు నమ్మకముగలదు. హుమాయూన్ బాదుషాయొక్క ప్రకృతిబట్టిచూచిన అతడు చిత్తూరురాణిని ధర్మసోదరిగ తలంచుటకు వెనుదీయడని నాకు విశ్వాసము."

"నీకు దీనిపై విశ్వాసమే ఉన్నచో మరి ఆలస్యమేల? సూత్రము శీఘ్రముగనే బాదుషావద్దకు బంపుము."

"కాని మొదట పాదుషావద్దకు మనిషినిబంపి అతని యుద్దేశ్య మెరుంగవలయునని నాతలంపు. అనంతరమున వీలుగా ఉన్నప్పుడు రక్షాసూత్రము గూడ బంపవచ్చును. ఎందుకన ఒకవేళ అతడు దానిని త్రిప్పివైచుచో అపరిమితమగు అవమానము పొందవలసివచ్చును."

ఇద్దరుస్త్రీలును మేవాడ్ రాణాయగు సంగ్రామసింహుని భార్యలు. మొదటియామె పేరు కర్ణవతి, రెండవయామె పేరు జవాహిర్ బాయి. రాణాసంగ్రామసింహు డప్పుడు జీవించియుండలేదు. ఇద్దరురాణుల కిద్దరు పుత్రులుగలరు. ఒకని పేరు విక్రమజిత్, రెండవ వాని పేరు ఉదయసింహుడు. మాలవ్యా బాదుషాలతో మేవాడ్‌నకు ఎప్పుడు శత్రుత్వమువిడువక వచ్చుచుండెను. సమయము దొరికినప్పుడు ఒకరు రెండవవారిపై పగదీర్చుకొన తలంచుచుండిరి. సరిగ రాణా బ్రతికియున్నంతకాలము వారికి వీలుచిక్కినది కాదు. మరణించినపిదప విక్రమజిత్తు సింహాసన మధిరోహించెను. కాని యీతడు కొలదిరోజులలోనే అందర కప్రియుడై పోయెను. గుజరాత్ పాదుషా బహాదుర్ షా మేవాడ్ పరిస్థితులన్నియు తెలిసికొని చిత్తూరుపై ఆక్రమణ చేయదలంచి వలయు సన్నాహము లాచరించుచుండెను. మేవాడ్ వాసులకుగూడ అతనియుద్యమము తెలిసెను. కాన వారందరు అత్యంత శంకితులైరి. ముఖ్యముగ రాణి కర్ణవతి తనకుమారుడగు ఉదయసింహుని విషయములో బెంగగొని యుండెను.

రాణీకర్ణవతి తాను నిశ్చయించినట్లుగ పురోహితునిపిలిచి తనఅభిప్రాయము వెల్లడించెను. పురోహితుడు బాదుషావద్దకు లేఖగొంపోవ స్వీకరించెను. యథాసమయములో రక్షాసూత్రముగూడ పాదుషావద్దకు బంపబడుననికూడ తెలిపెను. పురోహితుడు శుభముహూర్తమున ఆగ్రానగరమునుగూర్చి ప్రయాణమయ్యెను.

౨

బాదుషాహాయగు హుమాయూన్ నివాసము ఆగ్రానగరము. ఈసమయమున శత్రువులవలన నతనికి గూడ మిక్కిలి శ్రమగా ఉండెను. ఆఫ్గనిస్థానమందొక విద్రోహదళము, బంగాళా, బీహార్ దేశములలో శర్ షాహాయున్న యుద్ధమున కెదురుచూచుచుండిరి. రాణీకర్ణావతి పురోహితుడుద్వారా లేఖ పంపునప్పటికి హుమాయూన్ బంగాళాదేశము వైపునకు దండెత్తిపోవుటకు సిద్ధుడైయుండెను. బాదుషా సభలో కూర్చునియుండెను. ఇంతలో ద్వారపాలుడు పాదుషాకు పురోహితుని రాక యెరింగించెను. చిత్తూరు రాణియొక్క కులపురోహితు డేదియో అవశ్యకకార్యముపై తనవద్దకు వచ్చియుండెనని గ్రహించి హుమాయూన్ వెంటనే యాతనిని లోనికి రప్పించి సంగతేమని అడుగగా పురుహితుడు రాణీ కర్ణావతియొసగినలేఖ అతనికి అందిచ్చెను.

పాదుషా లేఖపఠించెను. అనంతరమున పురోహితుడు—"ఇదికాక ఆజ్ఞయొసగుచో నేను కొంత వక్కాణించెదను" అనెను.

"మంచిది. సుల్తాను బహాదుర్ షాహ చిత్తూరుపైకి దాడివెడలి వచ్చుటకు బయలుదేరి యుండెనా?"

"బయలుదేరుట కుద్యుక్తుడై యుండెను. శీఘ్రము లోనే బయలుదేరునని వినియుంటిని."

"నేను నాశక్తికొలంది రాణి ప్రార్థనముచెల్లింప ప్రయత్నించెదను."

"పాదుషావారి మాటలచే నేను సంతుష్టుడనైతిని. చిత్తూరు రక్షింపబడుననియు, రాణా సంగ్రామసింహుని వంశము లుప్తము కాజాలదనియు నాకు నమ్మకము కలిగినది."

"సంగరాణాయొక్క అద్భుతవీరత్వముపై నేనత్యంతము ముగ్ధుడను. అందుచే యథాశక్తి నేను వారి వంశమును కాపాడుటకు ప్రయత్నము చేసెదను. రాణితో మీరు నాయీ యుద్దేశ్యమును తెలుపుడు."

"బాదుషాహ ఆజ్ఞ శిరోధార్యము."

"సమయము వచ్చినప్పుడు రక్షాసూత్ర మంపెద నని రాణి తనలేఖలో తెలిపియుండెను. రక్షాసూత్ర బంధనమన్న నేమో తెలియజేయుడు."

"మా రాజపుత్రస్త్రీలలో నొక రివాజుగలదు. ఏ స్త్రీయైనను ఒకరితో ధర్మసోదరునిగా సంబంధము స్థాపనముచేయ నుద్దేశించియున్నప్పుడు రక్షాసూత్ర మను నొకత్రాడు చేతికి కట్టిబంపుదురు. ముఖ్యముగ వారేదైన విపత్తులో చిక్కుకొనియున్నప్పుడు పంపుదురు."

"రక్షాసూత్రబంధనముద్వారా సోదరసోదరీసంబంధము స్థాపితమగునా?"

"అవును ఎవనియొద్దకు రక్షాసూత్రమంపబడునో అతడు ప్రాణములనొసగియైనను ఆమెకు సహాయ్యము చేయును.

"మొగలుపాదుషాకూడ యిందుకు వెనుదీయడు. సాదరపూర్వకముగ యామెపంపు రక్షాసూత్రము గ్రహించెదనని మీరాణితో జెప్పుము. నేను బంగాళా దేశము వైపునకు జనదలచితిని కాని యామె అనురోధము తీర్చుటకై ఇప్పుడే యావత్తుసేనతో చిత్తూరు వైపునకు బయలుదేరి వచ్చుచున్నాను."

"పాదుషావారి ఆజ్ఞ శిరోధార్యము" అనిపలికి పురోహితుడు సెలవుగొని చిత్తూరునకు ప్రయాణ మయ్యెను.

3

బహదూర్‌షాహ ప్రతిహింసాగ్ని హృదయమును దహింప చిత్తూరును భస్మీపటలముగావింప పెద్దసేనా సమేతుడై చనుదెంచుచుండెను. ఆతని ఆశ్వికదళము కాల్బలమునకు అంతులేకుండెను. ఇదియుగాక ఫిరంగులప్రేల్చు సైనికులుగూడ అనేకతుపాకులతో అరుదెంచుచుండిరి. లాబ్రీఖాన్ అనువాడు తుపాకి వీరులకు నాయకుడు.

రాణావిక్రమజిత్తు అప్పుడు బూందీ రాజ్యాంతర్గత మగు "వైచ"మను పట్టణమున ఉండెను. బహదూర్ షాహ సేన మొదట అచ్చటనే కనిపించెను. విక్రమ జిత్తుకూడ వెనుకడుగు వేయువాడు కాడు. అతడు తన గుప్పెడు సేననుగైకొని ఆ అసంఖ్యసేనతో దల పడెను. అతని అధీనమందుగల సర్దారు లాతనిని రక్షించుటకన్న చిత్తూరును గాపాడుటయేముఖ్యమని ముందున కేగిరి. బహదూర్‌షాహయొక్క ప్రబలపరాక్రమ సైన్యమెదుట విక్రముడు నిలువజాలక పోయెను. నేడు చిత్తూరునకు సర్వనాశము సిద్ధమయ్యెను. కోటగోడకు రంధ్రముచేసి మహమ్మదీయులు లోన ప్రవేశించిరి.

దుర్గారావు, సత్తూ, దద్దూ మొదలగువారు రంధ్ర పథమందు జీవములు త్యజించిరని విని జవాహిర్‌బాయి కొలదిసేపటిలో అస్త్రశస్త్రములు కవచము మొద లగునవి దాల్చి యచ్చటకు వచ్చెను.

రాజమాతను గాంచి సర్దారులు సైనికులు ద్విగుణీకృతోత్సాహముతో బోరదొడంగిరి. కాని ఫిరంగి గుండు తగులుటచే నా వీరనారీరత్నముకూడ నేల కొరగెను. వీరనారియగు ఆమె చిత్తూరురక్షణము కొరకై నవ్వుచునవ్వుచు ప్రాణములర్పించెను. అనంతర మున మిగిలిన రాజపుత్రులు ప్రాణములొడ్డి యుద్ధము చేయసాగిరి.

జవాహిర్‌బాయి మరణవార్త రాణీకర్ణవతికి తెలిసినతోడనే యామె శోకసంతాపములచే అస్థిర యయ్యెను. అంతమున ఆమె పురోహితుని మరియొక సారి పిలిపించి ఇక నాలసింపకుమని రత్నస్థగితమగు సువర్ణకంకణము రక్షాసూత్రరూపముగ నాతనికి అందిచ్చెను. దానిని పురోహితుడుగైకొని పాదుషా దర్శనార్థమై వెడలిపోయెను.

హుమాయూన్ బాదుషా ఆగ్రానుండి బయలు దేరి అపారమగు సేనావాహినితో చిత్తూరువైపునకు

రాజొచ్చెను. బహాదూర్ షా సుల్తాను చిత్తూరుకోటను వశపరచుకొనియెనని మేవాడ్ పొలిమేరవరకు వచ్చిన మీదట యూవైపునకుపోవుటకు ముదలయొసంగెను. అంతయు అతివేగమున చిత్తూరువైపునకు జని త్వరలో కోటసమీపమునపోయి నిలిచెను.

మొగలుసేన చిత్తూరుపొలిమేరకడ విశ్రమించియుండ నచ్చటకే పురోహితుడు చనెను. పాదుసా యగు హుమాయూన్ అతని తనదర్బారులోనికి పిలిపించి సంగతేమని అడిగెను.

పురోహితుడు యథోచితరీతి నాతనికి ప్రణమిల్లి పలికెను. "సమ్రాట్! చిత్తూరు సర్వనాశమగుటకు సంసిద్ధమై యున్నది."

"సుల్తాను కోటలో ప్రవేశించియుండెనాయేమి?"

"ఈపాటికి ప్రవేశించియుండును."

"అతడు కోటలో ప్రవేశించుట మీరు చూచియుండలేదనుకొందును."

"మహారాజా! లేదు ఊరకే కోటలో ప్రవేశించుట యాతనికి తేలికయా? అయినను అతనిరాక కడ్డుతగులువార లిప్పు డెవరున్నారు? అందఱు చిత్తూరుకొఱకై బలియై పోయిరి."

"రాణా జీవించియుండలేదా?"

"ఏకలింగస్వామికృపచే నాతడుజీవించియుండెను. కాని ఎచ్చటనుండెనో యెవ్వరు ఎరుగరు."

"అయిన ఇంతవరకు చిత్తూరును ఎవరు కాపాడిరి?"

"రాజపుత్ర సర్దారులును, రాజమాతయగు జవాహిర్‌బాయియును. కాని వీరులందరు స్వర్గమలంకరించిరి. రాజమాతయు పోరుచు మరణించెను."

"రాణీకర్ణవతియు ఉదయసింహుడు క్షేమముగా ఉన్నారా?"

"నేను వారు బ్రదికియుండగా చూచివచ్చితిని. రాణి పూర్వకథనమురీతిగ రక్షాసూత్రము పంపించి యున్నది."

ఇట్లు పలికి పురోహితుడు స్వర్ణవలయమును దీసి బాదుషాహు కొసగెను.

పాదుసా చేతికి దానిని తొడిగికొనగా పురోహితుడు శీఘ్రముగా చిత్తూరునకు దయచేయవలయునని కోరెను. అట్లే అని పాదుసా తన సైనికులతో చిత్తూరు వైపునకు జనెను. రాణీకర్ణవతిని రక్షించుటకొరకై యాతని హృదయము ఆతురపడుచుండెను. అతడు ఆ రక్షాసూత్రబంధనమును కర్తవ్యబంధనముగా దలంచి మిక్కిలి కంగారుతో ప్రయాణము చేయసాగెను.

రాజమాత మరణించిన పిమ్మట సుల్తాను సేనయొక్క వేగమును రాజపుత్రులు సహింపజాలకపోయిరి.

రాణీకర్ణవతి యంతయు వినెను. సర్దారులందరు యామెవద్దకు జని, "జననీ! దుర్గము రక్షింపబడినది కాదు. ఇక రాజపుత్రస్త్రీల కర్తవ్యము పాలనము చేయుదురుగాక" అని పలికిరి.

"మీరందరు చితులు అలంకరించుచుండుడు. అంతలో నేనును తయారగుదును. హా! రక్షాసూత్రమా! నిన్నెంత ఆలస్యముగా ఏలపంపితిని? పాదుసా చేరనే లేదు గదా."

"రక్షాసూత్రమే పంపినచో ఆలస్యమేల చేసితిరి?"

"ఏకలింగస్వామి యిష్టప్రకారము జరిగెను. ఆ స్వామి మన బలిదానము వాంఛించియుండెను. నేను కూడ వారి చరణసాన్నిధ్యముజేర నరుగుచుంటిని. మంచిది. కాని ఉదయసింహుని విషయమై యెట్టి ఉపాయ మాలోచించితిరి?"

"వారికొరకు మీరు విచారింపకుడు. బూందీవీరశ్రేష్ఠుడగు సూరతానురావువారి భారము తనపై నుంచికొనెను."

"అయిన నేను నిశ్చింతనై ప్రాణముల దొరగెదను. మీరందఱు సహగమన వ్రతమునకు పరికరములు గూర్చుడు. నేను సిద్ధము చేసికొందును."

రాజపుత్రులందరు చితి అలంకరింప దొడంగిరి. కొలదిసేపటిలోనే కలపదెచ్చి ఒక పెద్ద చితిపేర్చిరి. నేడు ఈ మండుచున్న చితిలో రాజపుత్రస్త్రీలు, మాతలు, సోదరీగణము, భార్యలు ఆత్మవిసర్జనము చేయుదురని యుద్ధములో చావగా మిగిలిన రాజపుత్రులనుకొనజొచ్చిరి.

చితిప్రజ్వలితమై అందుండి మంట బయలుదేరుచుండగా రాజపుత్ర స్త్రీలందరు అలంకరించుకొని అక్కడకు చేరిరి. రాణీకర్ణవతివద్దకు పదమూడు వేల రాజపుత్ర లలనలు ప్రోగయిరి. ఇంతలో సుల్తాను కోటను స్వాధీనము చేసికొని యీవైపునకే పరుగెత్తుకొని వచ్చుచుండెనని తెలియగా అందరు భగవానుడగు ఏకలింగస్వామి నామము స్మరించుచు ఆ చితిలో బడిరి. చూచుచుండగా అగ్నిశిఖ ప్రజ్వలించెను. పదమూడు వేల రాజపుత్రస్త్రీలు భస్మరూపముగ మారిపోయిరి!

౪

చిత్తూరు జయించి బహాదుర్‌షాహ సంతోష సముద్రమున యీదులాడజొచ్చెను. ఇంతలోనే హుమాయూన్ పాదుషా చిత్తూరు చేరెనని వార్త వచ్చెను. చక్రవర్తి లేఖగొని దూత కోటలో ప్రవేశించెను. హుమాయూన్ చక్రవర్తి బహాదూర్ షాహను కోటవిడిచి వెడలిపోవలసినదిగా వ్రాసెను. ఆరీతిగనే సుల్తాను కోటనువదలి తన దేశమునకు ప్రయాణమయ్యెను. హుమాయూన్ పాదుషాహ కోటలో ప్రవేశించి రాణీకర్ణవతి పదమూడువేల రాజపుత్రస్త్రీలతో ఆత్మబలిదానము చేసిన కథవిని స్తంభితుడైపోయెను. ఆతని నోటినుండి "హా! సోదరీ! రక్షాసూత్రము కొంచెముముందుగా ఎందుకు పంపక పోయితివి?" అను వాక్యములు వెడలెను.

విజయదశమి!

శ్రీమతి చర్ల నగరాజకుమారిగారు

రాజమహారాజ రాజాధిరాజులైన
కృష్ణరాయాది మహనీయులేలునపుడు
పూజ్యవై భారతీయ సంపూజ్యవగుచు
నెంతలెంతేసి గౌరవమ్మొనసినావొ!

నేడు దుర్భరదారిద్ర్య పీడితాత్ము
లయిన భారతీయప్రజలు ప్రాంజలి గయి
సేయుటేగాక స్వాగతం బీయలేరు
కాన్కలీయంగలేని బికారులగుట.

పూర్వమహనీయులెన్నియో మోదమునను
కాన్కలిచ్చి స్వాగతముల గౌరవించి
రనుచు వీరిమొడల బిట్టుకినియకమ్మ!
తినుటకేలేని యీభారతీయులే మొ
సంగి సత్కరింపగలరు జగతినిన్ను.

* * *

నాటిగౌరవమ్మందు శతాంశమైన
గాంచలేవన కల్లగా దించుకైన
విపుల విఖ్యాత సుచరిత్ర విజయదశమి!